# కాంగ్రెస్‌కు ఓటేస్తే కాట్లేసినట్టే..

- అభివృద్ధిని చూసి మద్దతివ్వండి
- కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలి
- చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- నూకలమర్రిలో బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడతో కలిసి ప్రచారం



నూకలమర్రిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినదిస్తున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యాక్షుడు వినోద్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ రూరల్, నవంబర్ 16 : కాంగ్రెస్‌కు ఓటేస్తే కాట్లేసిన్నట్టేనని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం రాత్రి వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, పోచెట్టిపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఏ సర్వేలు చూసినా కారుకు, సారుకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయనీ, అందరూ మరోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను, వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రతి నిత్యం తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ఆలోచించే సీఎం కేసీఆర్ మనకు ఉండడం గర్వకారణమన్నారు. ఈ ప్రాంతంపై అవగాహన ఉన్న ముఖ్యమంత్రి మనకు ఉండాలని, అవగాహన లేనివారితో మనకు ముప్పుతప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ వస్తే ఎవరు ముఖ్యమంత్రి అయితారో వారికే తెలియదని, ఢిల్లీకి బానిసలుగా ఉన్నవారు కావాలా?, తెలంగాణకు బాసటగా ఉన్న వారు కావాలో ప్రజలు అలోచించి ఓటు వేయాలని కోరారు. అనంతరం వినోద్‌కుమార్, చల్మెడ లక్ష్మీనర్సింహారావును గ్రామస్తులు ఘనంగా సన్మానించడంతోపాటు నాగలిని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గోస్కుల రవి, ఎంపీపీ బండ మల్లేశం, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, సర్పంచ్ పెంద్యాల తిరుపతి, కట్కం మల్లేశం, సుమన్, నాయకులు పిట్టల వెంకటేశ్, సోమినేని బాలు, అంజనీకుమార్, పెంద్యాల శంకర్, ఈర్యానాయక్, నారాయణ, రోమాల ప్రవీణ్, కమలాకర్, తిరుపతి, రేకబ్ పాల్గొన్నారు.

### సేవ చేయాలనే పోటీ చేస్తున్నా

నాకు ఓటేసి గెలిపిస్తే వేములవాడ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతా. నేను డబ్బులు సంపాదించుకోవడానికి రాలేదు. కేవలం ఈ ప్రాంత అభివృద్ధిలో నా కృషి ఉండాలని, సేవచేయాలనే లక్ష్యంతో పోటీ చేస్తున్నా. పాపం అని, గోస అని కాంగ్రెస్‌కు ఓటేస్తే మనం గోస పడాల్సి వస్తుంది. అందరూ కారుగుర్తుకు ఓటేయండి. అభివృద్ధి ప్రదాతకు అండగా ఉండి మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

**- బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పోలీస్ పరిశీలకులు వనీత సాహు ఐపీఎస్

# ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఐపీఎస్ వినీతసాహు
- పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం

తెలంగాణ చౌక్, నవంబర్ 16: సాధారణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఐపీఎస్ వినీత సాహు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండా స్వామి, ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి భద్రతా చర్యలు, ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పౌరుడూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా, ప్రజల్లో నమ్మకం, ధైర్యం కల్పించడంలో పోలీస్ కీలకంగా పనిచేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడడం, సంఘ వ్యతిరేక శక్తుల కార్యకలాపాలు, ఊరేగింపులు, బహిరంగ సమావేశాల నిర్వహణ క్రమబద్ధం చేయడంలో ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. హింసాత్మక ఘటనలు జరగకుండా చూడాల్సిన అనితర బాధ్యత పోలీస్‌శాఖపై ఉంటుందన్నారు. జిల్లాలో ఫ్రీ అండ్ ఫేర్‌గా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పోలీస్‌శాఖ తీసుకున్న, చేపట్టబోయే చర్యలను వివరించారు. ఎన్నికల విధులపై పోలీస్ అధికారులకు, సిబ్బందికి 7 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. జిల్లా సరిహద్దు వెంట 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రణాళికతో 6 చెక్‌పోస్టులు, డైనమిక్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు వెల్లడించారు. రూ.75,43,595ల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. 31 కిలోల గంజాయి, 1137 లీటర్ల లిక్కర్, రూ.15,20,370ల విలువైన ఇతర వస్తువులను సీజ్ చేసినట్లు వెల్లడించారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిని, సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వారిని ముందస్తుగా 582 కేసుల్లో 1503 మందిని గుర్తించి బైండోవర్ చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 77 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలున్న గ్రామాల్లో ప్రణాళిక ప్రకారం రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా పోలీస్ బలగాలు సుమారు 1000 మంది సిబ్బందితో ఈవీఎం స్ట్రాంగ్ రూల వద్ద ఏర్పాటు చేయబోయే మూడంచెల భద్రత గురించి తెలిపారు. ఇక్కడ అదనపు ఎస్పీ చంద్రయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు ఉపేందర్, కరుణాకర్, సదన్ కుమార్, శశిధర్‌రెడ్డి, కృష్ణకుమార్, కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్, ఆర్ఐ యాదగిరి ఉన్నారు.

# పేదల బతుకులు మార్చే పార్టీ బీఆర్‌ఎస్

- ఎన్నికల్లో కాంగ్రెస్ పన్నాగాలకు మోసపోవద్దు
- మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్



కరీంపేట్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

శంకరపట్నం, నవంబర్ 16: పేదల బతుకులు మార్చే పార్టీ బీఆర్‌ఎస్ అని బీఆర్‌ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కరీంపేట్, అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, వంకాయగూడెం, చింతగుట్ట, తాడికల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎం అయ్యాక 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామన్నారు. గోదావరి నీళ్లు తెచ్చి మూడు పంటలు పండేలా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రైతులకు రూ.14 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకుల పన్నాగంతోనే రుణమాఫీ ఆగిందని ఆరోపించారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చాక ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు. నియోజకవర్గంలోని 146 గ్రామాల్లో దళితబంధు పథకం ఇచ్చి తీరుతామన్నారు. ఈ నెల 20న జరిగే సీఎం కేసీఆర్ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా అంబాల్‌పూర్‌లో పలువురు ముదిరాజ్ కులస్తులు బీఆర్‌ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గడ్డం నాగరాజు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, వైస్ ఎంపీపీ రమేశ్, సర్పంచుల ఫోరం మండల చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, సర్పంచులు ముంజ వసంత, బైరి సంపత్, గుర్రం లత, కీసర సుజాత, ఎంపీటీసీలు గాండ్ల తిరుపతి, బొజ్జ కవిత, బుద్దార్థి వరలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ వీరస్వామి, విండోల చైర్మన్ సంజీవరెడ్డి, మధూకర్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్ రవి, సీనియర్ నాయకులు సతీశ్‌రెడ్డి, వెంకటేశం, సంపత్, సమ్మయ్య, శ్రీకాంత్, శ్యాంరావు, ఆదిత్య, మల్లేశం, సంపత్, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, రమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు బత్తుల వనజ, మహిళా నాయకులు

# పదవులు అనుభవించి విమర్శలా?

- ఈ విధానం సరికాదు
- మాజీ చైర్‌పర్సన్ పావనిపై బీఆర్‌ఎస్ మహిళా నేతల ఆగ్రహం
- సిరిసిల్ల గడ్డ కేటీఆర్ అడ్డా అని స్పష్టం

సిరిసిల్ల టౌన్, నవంబర్ 16 : మంత్రి కేటీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో చైర్‌పర్సన్ పదవిని అనుభవించిన సామల పావని నేడు బీఆర్‌ఎస్ నేతలపై విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని పావనికి మంత్రి కేటీఆర్ చైర్‌పర్సన్‌గా సువర్ణావకాశం కల్పించారని గుర్తుచేశారు. కేటీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతో పదవిని అనుభవించిన ఆమె బీఆర్‌ఎస్ నాయకులపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆ నలుగురు నాయకులే లేకపోయుంటే ఆరోజు ఆమెకు కౌన్సిలర్ టికెట్, చైర్‌పర్సన్‌గా అవకాశం వచ్చేది కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి పావనికి లేదని సూచించారు. పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం అందించేందుకు ఎన్ని సార్లు ఫోన్లు చేసినా కనీసం స్పందించలేదన్నారు. సిరిసిల్లలో ఇటీవల జరిగిన కేసీఆర్ సభావేదికపై ఆమెకు స్థానం కల్పించారని తెలిపారు. విశ్వాసం అనే పదం పావనితో పోల్చుకుంటే చిన్నబోతుందని మండిపడ్డారు. మున్సిపల్ కౌన్సిలర్లు దార్నం అరుణ, గడ్డం లత మాట్లాడుతూ ఐదేండ్ల పాటు పదవులు అనుభవించి ఈరోజు కేటీఆర్‌పై విమర్శలు చేయడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కేటీఆర్ నిధులు మంజూరు చేస్తేనే మున్సిపల్ పాలకవర్గంలో ఉన్న తామంతా కష్టపడితే సిరిసిల్లలో అభివృద్ధి పనులు జరిగాయని గుర్తుంచుకోవాలన్నారు. అందరి కష్టం, కేటీఆర్ కృషితో జరిగిన అభివృద్ధిని ఆమేదో సొంతంగా చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులంతా ఐక్యంగా పనిచేసి కేటీఆర్‌కు భారీ మెజార్టీని అందిస్తామన్నారు. సిరిసిల్ల గడ్డ కేటీఆర్ అడ్డా అని మరిచిపోవద్దని హితవుపలికారు. కాంగ్రెస్ కండువా కప్పుకోగానే మంత్రిపై విమర్శలు చేయడం సమంజసంగా లేదన్నారు. ఖబడ్దార్.. మరోసారి తప్పుడు విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మహిళా నేతలు చేరాల స్వాతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# 75 ఏండ్ల భారత ఆర్థిక వ్యవస్థ గ్రంథం ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 16: శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆచార్యురాలు డాక్టర్ కే శ్రీవాణి సంపాదకీయంలో వెలువడిన '75 సంవత్సరాల భారత ఆర్థిక వ్యవస్థ' పరిశోధనాత్మక గ్రంథాన్ని గురువారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సంకషాల మల్లేశ్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, 75 ఏండ్లలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చి ఆర్థికపరమైన పురోగతి దిశలో దేశం సాగుతున్నదన్నారు. గ్రంథం సంపాదకురాలు డాక్టర్ కే శ్రీవాణి మాట్లాడుతూ, గతంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్), తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) ఆర్థిక సహకారంతో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సమర్పించిన పరిశోధనా వ్యాసాలను క్రోడీకరించి గ్రంథాన్ని ముద్రించామన్నారు. ముందుతరం పరిశోధకులకు ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తమని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాఫర్ జరి, కే పద్మావతి, సోషియాలజీ విభాగాధిపతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.